క్లుప్తంగా

మంత్రులను కలిసిన నాయకులు

డిప్యూటీ సీఎం భట్టిని..



డిప్యూటీ సీఎం భట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సీ విభాగం కన్వీనర్ చెన్నయ్య, నాయకులు

కొణిజర్ల: తెలంగాణ రాష్ట్ర నూతన డిప్యూటీ సీఎంగా నియమితులైన మల్లు భట్టి విక్రమార్కను టీపీసీసీ ఎస్సీ విభాగపు కన్వీనర్ దర్జీ చెన్నారావు గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. భట్టి నేతృత్వంలో ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మోదుగు వెంకటి, తుళ్లూరి వీరయ్య, మాళోజీ అంతోని తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని..



మంత్రి పొంగులేటికి అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తల్లాడ మండల నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పొంగులేటిని కలిసిన వారిలో గోపిశెట్టి వెంకటేశ్వరరావు, యర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, రాయల రాము, నారపోగు వెంకటేశ్వర్‌రావు, గోవింద్ శ్రీనువాసరావు ఉన్నారు.

మంత్రి తుమ్మలని..



మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు

కల్లూరు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, హైదరాబాద్ క్రీసెంట్ ఫార్మసీ కంపెనీ ఎస్‌కే జానిమియా, నల్లమల వెంకటేశ్వరరావులు హైదరాబాద్‌లోని తుమ్మల నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల పర్యటనలో భాగంగా కల్లూరు వస్తానని తుమ్మల పేర్కొన్నట్లు వారు పేర్కొన్నారు.

వైరా ఎమ్మెల్యేను..



వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో నాయకులు

కొణిజర్ల: వైరా నూతన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను హైదరాబాద్‌లో గురువారం పలువురు మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో నియోజకవర్గ పర్యటనకు వస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శేషగిరిరావు, వైరా మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, సురేందర్, వీరయ్య, వెంకటి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



పెనుబల్లిలో సంబురాలు నిర్వహిస్తున్న దృశ్యం

తల్లాడ/పెనుబల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తల్లాడ, పెనుబల్లి మండలాల్లో గురువారం సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రులుగా మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేయటంతో కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్స్ పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి కిరణ్‌కుమార్, మేకతొట్టి కాంతయ్య, తాళ్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓరనోౕ.. రైతన్నా



ముసలిమడుగులో నేలకొరిగిన వరి



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

నష్టాన్ని మిగిల్చిన మిచాంగ్

- నేలకొరిగిన వేలాది ఎకరాల వరిపైర్లు
- తడిచిన ధాన్యం రాశులు
- ఆందోళనలో అన్నదాతలు
- పరిహారం చెల్లించాలని వేడుకోలు

ఆరుగాలం శ్రమించి ఎన్నో వ్యయప్రయాసాల నడుమ పంటను సాగు చేశారు. ఇకా పంట చేతికి అందుతుంది కదా..! అని సంబురపడే లోపే మిచాంగ్ తుపాన్ రూపంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు రైతులను నట్టేట ముంచిన నేపథ్యాన రైతు గుండె నీరుగారింది. దాంతో అన్నదాత ఏమి చేయలేని దయనీయ స్థితిలో ఆకాశం వైపు దిగాలుగా చూస్తూ.. తనలో తానే మదనపడుతూ ఆక్రోశాన్ని వెల్లబుచ్చుతున్నాడు.

వైరారూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందు ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసిన నేపథ్యాన వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సింహాభాగం సుమారు 19,046 ఎకరాల వరి, 478 ఎకరాల మొక్కజొన్న, 826 ఎకరాల మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలో మినహా దాని తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరిపంటకు సాగునీటి సమస్యలు తలెత్తడంతో వరిపైర్లు ఆలస్యంగా కోత దశకు చేరుకున్నాయి. ఇప్పటికే మండలంలోని దాచాపురం, విప్పలమడక, గరికపాడు, పూసలపాడు, ఖానాపురం, సోమవరం గ్రామాల రైతులు సుమారు 600 నుంచి 800 ఎకరాల వరిని కోయించి ధాన్యం రాశులను కల్లాలు, రహదారుల వెంబడి అరబెట్టుకోని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోని గిట్టుబాటు ధరతో లబ్ధిపొందుదామని సంబురపడుతున్న సమయంలో మిచాంగ్ తుపాన్ రైతుల ఆశలను ఆవిరి చేసి పంటలను నాశనం చేసింది.

ఆగమైన పంటలు..

పలు గ్రామాల్లోని రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి పంటలను కోయించి ధాన్యం రాశులను రహదారుల మీద అరబెట్టారు. తుఫాన్ సూచనలతో ధాన్యం రాశులు, బస్తాలు తడవకుండా ముందస్తు చర్యలలో భాగంగా టార్పాలిన్ పట్టాలు కప్పినప్పటికీ పట్టాలపై వర్షపునీరు వందలాది ఎకరాల ధాన్యం రాశులు తడిచిపోయాయి. అదే విధంగా మండలంలో 6,516 మంది రైతులకు చెందిన 9,530 ఎకరాల వరి పైర్లు ఈదురు గాలులతో కూడి భారీ వర్షాలకు పూర్తిస్థాయిలో నేలకొరగడమే కాకుండా పొలాల్లో మోకాళ్లలోతు వర్షాపు నీరు చేరడం ధాన్యం పనాలు మొత్తం పూర్తిస్థాయిలో తడిచిపోయాయి. అదే విధంగా 151 మంది రైతులకు చెందిన 183 ఎకరాల మొక్కజొన్న, 185 మంది రైతులకు చెందిన 533 ఎకరాల మిర్చి పంట పూర్తిస్థాయిలో నెలకొరగడంతో పత్తి, మిర్చి కాయ ఎర్రబారి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారమైన పెట్టుబడులు..

వర్షాలు లేకుండా ఉంటే ఒక ఎకరం వరి పంట కోయించేందుకు గంటన్నర సమయంతో పాటు రూ.3 వేల ఖర్చు వస్తుంది. ప్రస్తుతం పంటలన్నీ నేలకొరగడంతో కేవలం కోతమిషన్లు మాత్రమే అందులోకి దిగి కోతకోసి బయట కల్లాల్లో వేయాల్సి ఉంది. హార్వెస్టర్‌తో కోత.. ఎకరానికి 4 గంటల సమయం పడుతుంది. గంటకు రూ.3 వేల చొప్పున ఎకరానికి రూ.12వేలు ఖర్చు వస్తుండడంతో రైతులకు పెట్టుబడుల భారం అధికంగా మారింది. అదే విధంగా చెట్లపై ఉన్న మిర్చి తెల్లబారడంతో పాటు.. పత్తి ఎర్రబాడి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రెండెకరాల ధాన్యం రాశులు తడిచాయి..



నేను 20 ఎకరాల్లో వరిసాగు చేస్తే.. 2 ఎకరాలు కోయించి తేమశాతం కోసం ధాన్యం రాశులను కల్లాల్లో ఆరబెట్టాను. ఆ ధాన్యం రాశులు మొత్తం వర్షానికి తడిచిపోవడమే కాకుండా 18 ఎకరాల వరి ఈదురు గాలులకు నేలకొరిగి పన్నాలు మొత్తం వర్షపు నీటిలో తడిచిపోయాయి. దాంతో పెట్టుబడులు వస్తాయో లేదో అని ఆందోళనగా ఉంది.

– వేమిరెడ్డి పిచ్చిరెడ్డి, రైతు, దాచాపురం

పెట్టుబడులు భారంగా మారాయి..



నేను 8 ఎకరాల్లో సాగు చేసిన వరి పైర్లు నేలకొరిగాయి. గతంలో ఒక ఎకరం వరిపంట కోయించాలంటే పెట్టుబడులు రూ.3 వేలతో అయిపోయేది. ప్రస్తుతం మొత్తం పంట తడవడం వలన మిషన్‌తో కోయించాలంటే ఎకరానికి రూ.1 వేలు పెట్టుబడులు అవుతున్నాయి. అంత పెట్టుబడులు పెట్టి వరి కోయించినా ఎకరానికి 5 బస్తాల ఓడ్లు నెలరాలి ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– ముక్కార పుల్లారెడ్డి, రైతు, దాచాపురం



వరదలకు ఇసుక మేట వేసిన వరిపొలం

వరి పొలంలో ఇసుకమేట..

లబోదిబోమంటున్న రైతులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం గంగారం గట్టు బజార్ కాలనీకి చెందిన రైతులు నూర్‌అహ్మద్, బాజీలు కలిసి ఐదు ఎకరాల వరిపంట కౌలుకు సాగు చేస్తున్నారు. రెండురోజుల పాటు కురిసిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పొలంలో ఇసుక మేట వేసిందని రైతులు లబోదిబోమంటున్నారు. పంట అంతా కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నష్టం అంచనాలు రూపొందించండి



సమీక్ష నిర్వహిస్తున్న ఏడీఏ నరసింహారావు

కల్లూరు: మిచాంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు రూపొందించాలని సత్తుపల్లి వ్యవసాయ సంచాలకుడు నరసింహారావు.. వ్యవసాయ అధికారులను కోరారు. గురువారం కల్లూరు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాన్ కారణంగా ఈదురు గాలులకు పడిపోయిన పైర్లను మీ దగ్గర ఉన్న ఆధారాల ప్రకారం ఎన్ని ఎకరాలు అనేది రైతు పేరుమీద నమోదు చేయాలన్నారు. రైతులు వరి పైరును కోసే ప్రయత్నం చేస్తారు కాబట్టి ఇప్పుడైతేనే ఖచ్చితంగా అంచనా వేయడానికి కుదురుతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎం.రూప, ఏఈఓలు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు..



కుర్నవల్లిలో.. వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తల్లాడ: తుపాన్ కారణంగా మండలంలోని కుర్నవల్లి గ్రామంలో తడిసిపోయి నేలకొరిగిన వరి పైరును సత్తుపల్లి వ్యవసాయ శాఖా సంచాలకులు నరసింహారావు, ఏఓ ఎండి.తాజుద్దీన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



కొణిజర్ల: లాలాపురంలో.. మొక్కజొన్నను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



కారేపల్లి: నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు



ఏన్కూరు: మిర్చి తోటను పరిశీలిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కొణిజర్ల/ఏన్కూరు/కారేపల్లి: తుపాన్ ప్రభావంతో మండలంలోని పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎస్‌కె.లాల్ మియా, ఏఐఏఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం కొణిజర్ల మండలంలోని లాలాపురం, పల్లిపాడు గ్రామాల్లో మిర్చి, మొక్కజొన్న పంటలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. అదే విధంగా ఏన్కూరు మండలంలోని జన్నారం, రాజలింగాలలో పంటలు పరిశీలించగా.. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కారేపల్లిలోని పేరుపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసుకున్న పంటలు చేతికొచ్చే సమయంలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నరసయ్య, పారుపల్లి శ్రీనాద్, ఎస్‌డి పాషా, పురుషోత్తం, ప్రభాకర్, కె.వెంకటేశ్వర్లు, గడ్డం వెంకన్న, చాపల లక్ష్మి, ఏఐకేఎంఎస్ మండల నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, అలెం చంద్రయ్య, గురవయ్య, వై.జానకి, సంపత్, సుగుణ, వెంకన్న, బైరుమల్ల లక్ష్మయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీతోనే ఉంటా..

- సమర్థవంతంగా ప్రతిపక్ష హోదా నిర్వహిస్తా..
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా.. నియోజకవర్గంలో నాకు ఓటు వేసిన 91,805 మంది పక్షాన నిలబడుతూ ప్రతిపక్ష హోదాను సమర్థవంతంగా నిర్వహిస్తానని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం పట్టణంలోని కౌన్సిలర్ మట్టా ప్రసాద్ నివాసంలో.. నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికీ మీతోనే ఉంటానని.. ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 85 ఫంక్షన్‌హాళ్లు, ఆస్పత్రులతో పాటు పలు అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరితగతిన ప్రారంభించే విధంగా చూడాలన్నారు. 2,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రాజకీయాలకు అతీతంగా ఇవ్వాలని కోరారు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఫోన్ చేసి చంపుతామని బెదిరిస్తున్నారని, కార్యకర్తలు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. ఎన్నికల్లో తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు..

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ముగ్గురు సీనియర్ నాయకులకు మంత్రి పదవులు ఇచ్చిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె.రఫీ, ఎంపీపీ అలైఖ్య, చెక్కిలాల మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, మాధురి మధు, పవన్, చెంచిరెడ్డి, ఎస్‌కె ఖాండ్‌పాషా పాల్గొన్నారు.

జగజ్జెట్టి..



మధిర ముఖచిత్ర
రూపును మార్చెనెవడు..
పేద సాదల మనను తెలిసెనెవడు..
కోరివచ్చిన వారల కోర్కె తీర్చ
నేను నేనని ధైర్యమై నిలిచెనెవడు..
అతడు ఘనుడని చెప్పగా తగినవాడు..
ఎవ్వడతడని తెలియ ఎంత హాయి..
పంచ కట్టు సొగసు పల్లె పలకరింపు..
చదువు నేర్పిన సంస్కార చక్కదనము..
పట్టు బిగబట్టి సాధించు గట్టితనము..
రూపు కట్టిన జగజ్జెట్టి
మధిర భట్టి..

డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు..
కవి, రచయిత, పరిశోధకుడు
మధిర పట్టణ రంగస్థలం కళాకారులు
– మధిర

జాతీయ కరాటే పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి నిఖితను అభినందిస్తున్న ప్రవీణ్

తల్లాడ: జాతీయ స్థాయిలో నిర్వహించే కరాటే పోటీలకు స్థానిక బాలభారతి విద్యాలయానికి చెందిన కటికి నిఖిత ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, విద్యాలయ కరస్పాండెంట్ ప్రవీణ్ తెలిపారు. నల్గొండ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో ఆమె రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి గోల్డ్ మెడల్‌ను సాధించింది. ఈ నెల 5 నుంచి 7 వరకు నల్గొండలో జరిగిన ఈ పోటీల్లో నిఖిత పాల్గొని తన ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. దీంతో నిఖితను కరాటే మాస్టర్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: కేన్సర్‌తో బాధపడుతున్న స్థానిక టాలెంట్‌స్కూల్ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి రూ.76,500లను గురువారం ఆమె స్నేహితురాలు సరస్వతికి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

ముదిగొండ: మండలంలోని పమ్మిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో బొడ్రాయి, శ్రీపోతురాజు, సహిత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు, కోటమైసమ్మ అమ్మవారు, గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మందిర ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి పమ్మి గ్రామంతో పాటు మల్లన్నపాలెం, కమలాపురం, చిరుమర్రి, అమ్మపేట, వల్లాపురం, వనంవారికిష్టాపురం, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు.. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు సాయినాథుడిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సూరే నాగకృష్ణారావు, ఆవుల సుబ్బారావు దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.